## జడ్పీ చైర్‌పర్సన్ పదవికి కోవ లక్ష్మి రాజీనామా

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, డిసెంబర్ 8 : కుమ్రం భీం ఆసిఫాబాద్ జడ్పీ చైర్‌పర్సన్ పదవికి ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి రాజీనామా చేశారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఆమె ఎమ్మెల్యేగా గెలుపొందడంతో ప్రస్తుతమున్న జడ్పీ చైర్ పర్సన్ పదవికి రాజీనామా చేశారు. ఈ మేరకు శుక్రవారం తన రాజీనామా పత్రాన్ని జిల్లా కలెక్టర్ హేమంత్ బోర్కడేకు అందజేశారు. ఈ మేరకు రాజీనామాను కలెక్టర్ ఆమోదించారని ఆమె తెలిపారు. అనంతరం జడ్పీ వైస్ చైర్మన్‌గా ఉన్న కోనేరు కృష్ణారావు ఇన్‌చార్జి జడ్పీచైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీలు, బీఆర్‌ఎస్ నాయకులు తదితరులు ఉన్నారు.



కలెక్టర్‌కు రాజీనామా పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

# అండగా ఉంటా..ధైర్యంగా ఉండండి



జైనూర్ కార్యకర్తలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

- కాంగ్రెస్ 6 గ్యారెంటీలను అమలు చేయకుంటే ఉద్యమానికి సిద్ధమవ్వాలి
- బీఆర్‌ఎస్ కార్యకర్తలతో ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి

జైనూర్, సెప్టెంబర్ 8 : బీఆర్‌ఎస్‌లోని ప్రతి కార్యకర్తకూ అండగా ఉంటానని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి భరోసా కల్పించారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా పరిషత్ చైర్ పర్సన్ పదవికి రాజీనామా చేసినట్లు తెలిపారు. బీఆర్‌ఎస్ పార్టీ బడుగు బలహీన వర్గాల పార్టీ అని జిల్లా కేంద్రంలో కలెక్టరేట్, జోడేఘాట్ కుమ్రం భీం అభివృద్ధి, ప్రతి గిరిజన గ్రామంలో సంక్షేమ పథకాలు, షాదీ ముబారక్, కల్యాణ లక్ష్మి, రైతు బంధు, రైతు బీమా, కేసీఆర్ కిట్ లాంటి ఎన్నో సంక్షేమ పథకాలను బీఆర్‌ఎస్ ప్రవేశపెట్టిందని తెలిపారు. ఆసిఫాబాద్ ఎమ్మెల్యేగా గెలిపించినందుకు మండల కార్యకర్తలు సహాయ సహకారాలు ఎంతగానో ఉన్నాయని మీ రుణం ఎప్పటికీ మరిచిపోనని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని కార్యకర్తలు భయపడే అవసరం లేదని రాబోయే రోజుల్లో కేసీఆర్ ముఖ్యమంత్రి అవుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారెంటీలను అమలు చేయకున్నా, ప్రజలకు అందకున్నా మలి దశ ఉద్యమానికి కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఎన్నో అవమానాలతో చావు నోట్లో వెళ్లి తెలంగాణ రాష్ట్రాన్ని తెచ్చి, ఎన్నో సంక్షేమ పథకాలు అందించిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని కొనియాడారు. పలువురు కార్యకర్తలు కోవ లక్ష్మికి శాలువాతో సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కనక యాదవ్‌రావు, పాక్స్ డైరెక్టర్ కొడప హన్నుమపటేల్, జిల్లా పరిషత్ కో-ఆప్షన్ మెంబర్ అబుతాలిబ్, ఎంపీపీ కుమ్ర తిరుమల విశ్వనాథ్, పలు గ్రామాల సర్పంచ్‌లు ఎంపీటీసీలు మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు ఇంతియాజ్‌లాలా నాయకులు మెస్రం అంబాజీ, పవన్ జన్నావార్, సతీశ్ ముండే తదితరులు పాల్గొన్నారు.

### లింగాపూర్ మండలాన్ని అభివృద్ధి చేస్తా

లింగాపూర్, డిసెంబర్ 8 : లింగాపూర్ మండలాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తానని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. శుక్రవారం ఆమె మండలంలోని ఎల్లా పటార్ గ్రామానికి చెందిన సలాం మారు ఎమ్మెల్యే కోవ లక్ష్మి విజయం సాధించాలని 14 రోజులు పాటు తిండి తినకుండా దీక్ష చెప్పడంతో సలాం మారును నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమణ చేయించారు. లింగాపూర్ మండలం నుంచి అధిక మెజార్టీ ఇచ్చి గెలిపించినందుకు ప్రజలందరికీ రుణపడి ఉంటానని అన్నారు. జాటోత్ రాహుల్ కుమారుడు ధ్రువ మృతి చెందడంతో కుటుంబ సభ్యులను పరామర్శించారు. మహాత్మా గాంధీ, బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహాలను పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆమె వెంట వెంట జిల్లా గ్రంథాలయ చైర్మన్ కనక యాదవ్ రావు, జైనూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆత్రం భగవంతరావ్, జడ్పీటీసీ ఆడే రక్కబాయి లక్యా నాయక్, నాగర్ గోజ్ విశ్వం బర్, వైస్ ఎంపీపీ ఆత్మరావ్,సర్పంచులు సుమలత ఈశ్వర్, మనోహర్,చిరంజీవి, మంగి బాయి కిషన్, జ్యోతిరామ్, సులోచన సంతోష్, జైనూర్, లింగాపూర్ మండల అధ్యక్షుడు లాలా, అనిల్ కుమార్, భీమ్‌రావ్, సంగీత వినోద్ తదితరులు పాల్గొన్నారు.

## కేసీఆర్ త్వరగా కోలుకోవాలని పూజలు



పూజల అనంతరం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను సన్మానిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

బోథ్, డిసెంబర్ 8: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ త్వరగా కోలుకొవాలని వేడుకుంటూ శుక్రవారం బోథ్ మండల కేంద్రంలోని సాయిబాబా ఆలయంలో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, కార్యకర్తలు, నాయకులతో కలిసి పూజలు నిర్వహించారు. కేసీఆర్ త్వరగా కోలుకుని ప్రజలకు మరిన్ని సేవలందించాలని వేడుకున్నారు. అనంతరం ఎమ్మెల్యేగా గెలుపొందిన అనంతరం మొదటి సారిగా బోథ్‌కు వచ్చిన సందర్భంగా బీఆర్‌ఎస్ నాయకులు పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆధ్యాత్మిక మార్గాన్ని అలవర్చుకోవాలి

- బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్
- కైలాస్ టెక్డీలో మహాదేవుని ఆలయంలో పూజలు



మహాదేవుని ఆలయానికి వస్తున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

బోథ్, డిసెంబర్ 8 : ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక మార్గాన్ని అలవర్చుకోవాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. శుక్రవారం మండలంలోని నిగిని అటవీ ప్రాంతంలోని కైలాస్ టెక్డీలో కొలువైన మహాదేవునికి ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ త్వరగా కోలుకోవాలని ఆ మహాదేవున్ని ప్రార్థించారు. బోథ్ ప్రజలు సుఖఃశాంతులతో, అష్టఐశ్వర్యాలతో, పంట పొలాలు పచ్చగా ఉండాలని వేడుకున్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో భక్తులతో కలిసి పాల్గొన్నారు. ఆలయం వద్ద శ్రీకృష్ణ హాస్పిటల్ డాక్టర్ క్రాంతికుమార్ ఆధ్వర్యంలో నిర్వహించి ఉచిత వైద్య శిబిరాన్ని సందర్శించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రహదారులకు హరిత శోభ



జన్నారం మండల కేంద్రంలో జాతీయరోడ్డు నుంచి ధర్మారం, బాదంపెల్లి వెళ్లే రహదారిలో పెరిగిన చెట్లు హరిత పందిళ్లను తలపిస్తున్నాయి. పొనకల్, కలమడుగు, రేండ్లగూడలో రహదారికి ఇరువైపులా హరితహారం మొక్కలు పెరిగి పచ్చదనంతో ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. పచ్చని అందాలతో వాహనాదారులకు కనువిందు చేస్తున్నాయి.

-జన్నారం, డిసెంబర్ 8

## కవ్వాల్ ఫారెస్ట్‌లో ట్రైనీ సెక్షన్ ఆఫీసర్లకు శిక్షణ



గోండుగూడ అడవుల్లో సెక్షన్ అధికారులకు అవగాహన కల్పిస్తున్న అకాడమీ ఏడీ రామ్మోహన్

జన్నారం, డిసెంబర్ 8 : కవ్వాల్ టైగర్ రిజర్వ్‌డ్ అడవుల్లోని జన్నారం గోండుగూడ బీట్ చింతగూడ సెక్షన్‌లో హైదరాబాద్ ధూలపెల్లి తెలంగాణ ఫారెస్ట్ అకాడమీలో 34మంది ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్లకు ధూలపెల్లి అకాడమీ అసిస్టెంట్ డైరెక్టర్ రామ్మోహన్, డీఆర్వో తిరుపతి అడవుల రక్షణతో పాటుగా వన్యప్రాణులను రక్షించడం, వేటగాళ్లను నిరోధించడం, కలప స్మగ్లర్లను అరికట్టడంపై శిక్షణ ఇచ్చారు. బైసన్‌కుంట వద్ద చేపట్టిన అభివృద్ధి పనులు, అక్కడ పక్షులు ఆవాసాలు ఏర్పాటు చేసుకునేందుకు చేపట్టిన చర్యలను వివరించారు. వన్యప్రాణుల కోసం ఏర్పాటు చేసిన గడ్డి క్షేత్రాలు, సోలార్ మోటర్లతో నీటి వసతి, పరుపులేషన్ ట్యాంక్‌ల ఏర్పాటు, చెట్ల రకాలను తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో తిరుపతి, మహేశ్, ఎఫ్‌బీవో రహిమొద్దీన్, శిక్షణకు వచ్చిన సెక్షన్ అధికారులు పాల్గొన్నారు.

## కడెం ప్రాజెక్టు వద్ద సర్వే పనులు ప్రారంభం



ప్రాజెక్టు వరదగేట్ల కింది ప్రాంతంలో డ్రిల్లింగ్ పనులు చేపడుతున్న సిబ్బంది

కడెం, డిసెంబర్ 8: కడెం ప్రాజెక్టుకు రెండెళ్ల నుంచి భారీగా వస్తున్న వరద కారణంగా వరద గేట్ల కౌంటర్‌వెయిట్లు పడిపోవడంతో పాటు, ఇతర ఇబ్బందులు తలెత్తిన తరుణంలో ప్రాజెక్టుకు అదనపు వరదగేట్లు ఏర్పాటు చేసి ఇబ్బందులను తొలగించాలని ఈ ఏడాది వరదల అనంతరం ప్రాజెక్టు సందర్శన కోసం వచ్చిన కేంద్ర నిపుణుల బృందం సభ్యులు ఏబీ పాండ్యా నేతృత్వంలో చేపట్టిన సర్వే అనంతరం ఆ నివేదికలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు అందించిన విషయం తెలిసిందే. ప్రాజెక్టు పరిస్థితి దృష్ట్యా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అదనపు గేట్ల విషయమై పరిశీలించారు. ప్రస్తుతం 18 వరద గేట్లు ఉన్నప్పటికీ రెండెళ్ల నుంచి 6 లక్షల క్యూసెక్కుల పైగా ఎగువ ప్రాంతాల నుండి వరద రావడంతో ప్రాజెక్టుకు ముప్పు పొంచి ఉంది. ఈ 18 వరదగేట్ల ద్వారా కేవలం 3 లక్షల క్యూసెక్కుల నీరు మాత్రమే దిగువకు విడుదలయ్యే పరిస్థితి ఉండడంతో మరో ఆరు అదనపు గేట్లను ఏర్పాటు చేసి, స్పిల్‌వే పెంచాలని భావించినప్పటికీ ఉన్న 18 గేట్లకు మించి ఆ కట్టకు అదనపు గేట్లు పెంచడం సాధ్యం కాదని భావించిన నిపుణుల బృందం సభ్యులు ఈ నివేదికలను ప్రభుత్వాలకు అప్పగించారు. కట్టకు అదనపు గేట్లు ఏర్పాటు చేయడం సాధ్యం కాని పక్షంలో ప్రస్తుతం ఉన్న గేట్ల కింది ప్రాంతంలో నూతనంగా కట్టను నిర్మించి, 24 గేట్లతో నూతన ప్రాజెక్టు నిర్మించాలని భావించి, దానికి రూ. 600 కోట్లతో ప్రణాళిక తయారు చేశారు. దీంతో ఒక ఏజెన్సీ కంపెనీ ద్వారా ప్రస్తుతం ఉన్న వరదగేట్ల కింది ప్రాంతంలో కోర్‌డ్రిల్లింగ్ పనులు చేపడుతున్నారు. బోర్లు వేస్తూ నేల స్వభావ పరిస్థితులు, మట్టి నమూనాలను ఉన్నతాధికారులకు పంపించనున్నట్లు సర్వే ఏజెన్సీ బృందం సభ్యులు తెలిపారు.

## 12న ఉమ్మడి జిల్లా స్థాయి బాక్సింగ్ ఎంపిక పోటీలు

బెల్లంపల్లి, డిసెంబర్ 8: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-19 బాల బాలికల ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా స్థాయి ఎంపిక పోటీలు ఈ నెల 12న టైసన్ బాక్సింగ్ అకాడమీ ఆధ్వర్యంలో మంచిర్యాల జిల్లా పరిషత్ పాఠశాలలో నిర్వహించనున్నట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి బొంకూరి బాబురావు తెలిపారు. క్రీడాకారులు బోనఫైడ్, ఆధార్, ఇంటర్ ప్రథమ సంవత్సర విద్యార్థులు పదవ తరగతి మెమో, సెకండియర్ ఇంటర్ విద్యార్థులు ఫస్ట్ ఇయర్ మెమో నాలుగు జిరాక్స్ పత్రాలు తీసుకురావాలని సూచించారు. 11న సాయంత్రం రిపోర్ట్ చేయాలని, భోజనం, వసతి సౌకర్యం కల్పిస్తామని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు బాక్సింగ్ కోచ్ సీ హెచ్. రాజేశ్, 9963539234, పీఈటీ కే.దేవేందర్ 8099150447ను సంప్రదించాలని వెల్లడించారు.